క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు, హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.

లయన్స్‌క్లబ్ సభ్యుడికి అవార్డు



అవార్డును అందుకుంటున్న పెసల శ్రీకాంత్

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్ సభ్యుడు పెసల శ్రీకాంత్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 316.. 2022–23 సంవత్సరానికి గాను చంద్రకిరణ్ అవార్డు అందజేసిందని ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో జరిగిన సర్వీసు అవార్డ్స్ కార్యక్రమంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఫీడ ద హంగర్ (రోగులకు అన్నదాన కార్యక్రమం) ప్రతిరోజూ నిర్వహించినందుకు 6వ సారి ఈ అవార్డు దక్కిందని చెప్పారు.

ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: సోదరభావంతో కూడిన ఆత్మీయతకు ఇఫ్తార్ విందు ప్రతీక అని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో పట్టణ ముస్లిం యువత ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలతో ఉపవాస దీక్షను విరమింపజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భూమా కిశోర్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి, డైరెక్టర్ విజయసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాబులాల్ పాల్గొన్నారు.

నివాళి

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చు మధుసూదన్‌రావు (43) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చెరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి, కటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బెస్తల ఆత్మీయ సమ్మేళనం

నంద్యాల(అర్బన్): పట్టణ శివారులో వెలసిన జంబులాపరమేశ్వరి దేవస్థాన కల్యాణ మండపంలో రాయలసీమ స్థాయి బెస్తల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర ఫిషర్‌మెన్ జేఏసీ కో కన్వీనర్ రవీంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివ, కోదండ, రాజు, వెంకటేష్, మద్దిలేటి, శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, చంద్రబోస్, రాఘవేంద్ర, హరీష్, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్

చాగలమర్రి: స్థానిక సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల సమీపంలోని అష్రాఫ్ నగర్‌లో ఏఎన్ఎం మంజుల ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏసీ దగ్ధమైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించి ఏసీలో మంటలు చెలరేగాయి. ఆళ్లగడ్డ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

మరకతలింగేశ్వరుడికి మహారుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో మరకతలింగేశ్వరస్వామి

మహానంది: మాసశివ రాత్రి పురస్కరించుకుని గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో కొలువైన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర స్వామికి ఆదివారం మహారుద్రాభిషేకం పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు ఉదయం స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. సమీప గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని నవగ్రహ దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

భక్తుల కొంగు బంగారం కంబగిరయ్య

- రేపటి నుంచి సుద్దమల్లలో లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- 9న స్వామివారి కల్యాణం



సుద్దమల్లలో ఉత్సవాలకు ముస్తాబయిన ఆలయం(ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామి

ఉయ్యాలవాడ : కోరికలు నెరవేర్చి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు సుద్దమల్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి. ఉగాది పండుగ సందర్భంగా ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది వేడుకలు నిర్వహించడానికి నిర్వాహకులు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి చంద్రుడు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉత్సవాలకు మండలంలోని వివిధ గ్రామాలతో పాటు వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. పండుగ రోజు సంప్రదాయం ప్రకారం ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, లక్ష్మీదేవికి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు సుద్దమల్ల, అల్లూరు, ఉయ్యాలవాడ గ్రామాల నుంచి తేరుబండ్లతో తరలివచ్చి ఆలయం చుట్టూ వృషభరాజములచే ప్రదక్షిణ చేస్తారు. స్వామిని దర్శించుకోవడం వల్ల సర్వపాపాలు హరించబడతాయని, కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

అతడే తొలి ఓటరు

- తొలి పోలింగ్ కేంద్రమైన గుండుపాపలకు చెందిన హబీబ్
- నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు
- ఒకటవ పోలింగ్ స్టేషన్ గుండుపాపల, 295 సేషన్ డి.కొత్తపల్లె
- మొత్తం ఓటర్లు 2,31,473

దొర్నిపాడు: 2024 సాధారణ ఎన్నికల ప్రకటన వెలుబడటంతో కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల్లో ముఖ్యమైనది ఓటరు జాబితా. ప్రస్తుతం ఎక్కడ చూసినా.. ఎవరి పల్లెలో వారు ఓటరు లిస్టు ముందేసుకొని తమ పేరు ఉందో..లేదో వెతుక్కునే పనిలో నిమగ్నమయ్యారు.

గుండుపాపల ప్రత్యేకం..

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలున్నాయి. అందులో మొదటి పోలింగ్ స్టేషన్ గుండుపాపలతో ప్రారంభమై చాగలమర్రి మండలం డి.కొత్తపల్లెతో ముగుస్తుంది. దొర్నిపాడు మండలంలో పురుషులు 10,095, మహిళలు 10,095 ఉండగా మొత్తం 20,100 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే నియోజకవర్గం వ్యాప్తంగా పురుషులు 1,14,863, మహిళలు 1,16,596, థర్డ్ జెండర్ 14.. మొత్తం 2,31,473 మంది ఓటర్లు ఉన్నారు.

2,31,473 ఓటర్లలో మొదటి ఓటరు ఇతడే



ముల్లా హబీబ్‌బాషా

తొలి ఓటరు.. మొదటి పోలింగ్ మండలంలోని గుండుపాపల గ్రామంతో ప్రారంభం అవుతుంది. ముల్లా హబీబ్ బాషా అనే యువకుడు మొదటి ఓటరు కావడం గమనార్హం. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న 2,31,476 మంది ఓటర్లలో అతడే తొలి ఓటరు కావడంతో సంబర పడుతున్నాడు. మొదటి పోలింగ్ స్టేషన్ సీరియల్ నంబర్ 1లో ఐజీక్యూ 1388701 అనే ఓటర్ ఐడీ కార్డును కలిగి ఉన్నాడు. నియోజకవర్గంలో తొలిఓటరు అయినందుకు సంతోషంగా ఉందని పోలింగ్ రోజు కూడా మొదలి ఓటు తానే వేయడానికి యత్నిస్తానని ఆయన పేర్కొంటున్నాడు.

ఉత్తమ జీవనానికి దిక్సూచి భగవద్గీత



సందేశం ఇస్తున్న వైష్ణోకృప చైతన్య ప్రభు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భగవద్గీత దిక్సూచిలా నిలుస్తుందని కర్నూలు ఇస్కాన్ ప్రవచన కర్త వైష్ణోకృప చైతన్య ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు జరిగాయి. జగన్నాథ్, సుభద్రామాయి, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం శీల ప్రభు పాదుల ప్రేమ విందు జరిగింది.

ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి



తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: తెలుగు సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని శాప్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. నూతన తెలుగు సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఆదివారం పట్టణంలోని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆవిష్కరించారు. త్రైతసిద్ధాంతం సేవాసమితి సభ్యులు రామచంద్రుడు, మునిదాసు, పుల్లారెడ్డి, కుమారాచారి, భాస్కర్, మద్దిలేటి, సంజీవ, పార్థసారధి పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలి అలవరచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): గుండెజబ్బుల రోగుల సంఖ్య అధికమైన ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవనశైలి అలవర్చుకోవాలని ప్రముఖ గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ లక్ష్మణస్వామి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో బైపాస్ సర్జరీపై ఆరోగ్యఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మణస్వామి మాట్లాడుతూ ఇటీవల కాలంలో గుండెపోటు బాధితుల సంఖ్య అధికమైందన్నారు. యుక్త వయస్సు వారిలోనూ గుండెపోటు బాధితులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ పరిస్థితులు, మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం వంటివి దీనికి కారణాలుగా చెప్పారు. తమ వద్దకు వస్తున్న వారిలో ఎక్కువగా గుండెకు వెళ్లే రక్తనాళాలు బ్లాక్ అయి ఉంటున్నాయన్నారు. వారి లక్షణాలు, ఆరోగ్యస్థితిని బట్టి మందులు ఇవ్వడం, స్టెంట్ వేయడం, శస్త్రచికిత్సలు నిర్వహించడం చేస్తున్నామన్నారు. గుండె సమస్యలు తెచ్చుకునేకంటే రాకుండా నివారించుకోవడమే మేలన్నారు. అనంతరం ఆయనను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, చంద్రశేఖర కల్కూర, ట్రెజరర్ కేపీ రాముడు, సభ్యులు ఘనంగా సన్మానించారు.





నాడు : అధ్వానంగా కంపమల్ల మెట్ట- డబ్ల్యూ గోవిందిన్నె రహదారి, నేడు: నూతనంగా వేసిన రోడ్డు

తీరిన రహదారి ఇక్కట్లు

దొర్నిపాడు: కంపమల్ల మెట్ట నుంచి డబ్ల్యూ గోవిందిన్నె వరకు 6.6 కిలోమీటర్ల దూరం ఉంది. డబ్ల్యూ గోవిందిన్నె గ్రామస్తులు కంపమల్ల మెట్ట చేరుకుంటే కోవెలకుంట్ల-ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో కలుస్తారు. గ్రామస్తులకు ఈ దారిలో అత్యధికంగా పొలాలు ఉండటంతో రాకపోకలు అధికంగా ఉంటాయి. అలాగే కోవెలకుంట్ల మండలంలోని భీమునిపాడు, కంపమల్ల గ్రామస్తుల పొలాలు కూడా ఈ దారిలోనే ఉన్నాయి. ఇక పెద్దమ్మను దర్శించుకోవడానికి వచ్చే భక్తుల రాకపోకలకు ఈ రోడ్డు ప్రధానం. అయితే రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో పలుమార్లు ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు రోడ్డు బాగు చేయించాలని కోరినా గత పాలకులు పెడచెవిన పెట్టారు. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి దృష్టికి స్థానికులు సమస్యను తీసుకెళ్లడంతో ఆయన స్పందించి రూ.1.75 కోట్లు మంజూరు చేయించడంతో పనులు త్వరగా పూర్తి చేశారు. ప్రస్తుతం ఆ రోడ్డుపై రాకపోకలు వేగంగా సాగుతున్నాయి. అలాగే ప్రజలకు రహదారి ఇబ్బందులు తప్పాయి.

వైఎస్సార్‌సీపీకి అండగా నిలవండి



రుద్రవరంలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్‌రెడ్డి

రుద్రవరం: ఏవైనా అపోహలు ఉంటే వీడి సమన్వయంతో వైఎస్సార్‌సీపీ గెలుపునకు పాటు పడాలని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంతో పాటు ఆర్.కొత్తూరు,కొండమాయపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో నడుచుకోవాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా చేసిన మేలును గుర్తు చేస్తూ ఆ పరిస్థితులు కొనసాగాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని, అందుకు ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు వివరించాలని సూచించారు. చిన్న చిన్న అభిప్రాయ బేధాలు ఉంటే పక్కన పెట్టి కలసి కట్టుగా వైఎస్సార్‌సీపీ విజయానికి పాటుపడాలని చెప్పారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా గ్రామాల్లో ఎంతో అభివృద్ధి చేశామని, తిరిగి మన ప్రభుత్వం అధికారంలో వచ్చాక మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలుతో పాటు వలంటీర్లపై టీడీపీ చేసిన కుట్రను ప్రజలకు వివరించాలని చెప్పారు. చంద్రబాబుకు అధికారం కట్టబెడితే అవ్వ తాతలకు పింఛన్ ఇంటి వద్దకు రాదని సచివాలయాలు,రచ్చబండలు,దర్గాల వద్దకు వెళ్లి పడిగాపులు కాయాల్సి వస్తుందని వివరించాలన్నారు. పుట్లాలమ్మ క్షేత్ర చైర్మన్ గంగుల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, నాయకులు కొల్లం పుల్లయ్య, గఫూర్‌సాహెబ్, టీపీ నరసింహారావు(బాబు), బైరి శంకర్,నూకల కృష్ణమూర్తి,సూర్యనారాయణ,నంబర్‌వన్ వుశేని, కేసీ నరసింహులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మైనారిటీల సంక్షేమం



మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన ముస్లింలు

నంద్యాల: మైనారిటీల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని, అందుకు జగనన్న మైనారిటీలకు చేస్తున్న ఎనలేని సేవలే నిదర్శనమని మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 8వ వార్డు సంచిపట్టల వీధికి చెందిన అల్లీ సాహెబ్, ఫకూర్, గఫార్, రబ్బానీ, జాఫర్, మగ్బుల్, ఫయాజ్, షైన్‌షా,వలి తదితర వంద ముస్లిం, మైనారిటీ కుటుంబాలు నాయబ్ మహబూబ్ బాషా, గన్ని టీం ఆధ్వర్యంలో మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి మోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలసికట్టుగా శ్రమించి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

అభివృద్ధి పథంలో బోయలకుంట్ల

- రైతుల కోసం గోదాము నిర్మాణం
- ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు పూర్తి
- గ్రామస్తులకు మినరల్ వాటర్ సరఫరా
- డీబీటీ, నాన్ డీబీటీ కింద గ్రామస్తులకు రూ.24 కోట్ల మేర లబ్ధి

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. ఇప్పటి వరకు సౌకర్యాలు లేక ప్రజలు అవస్థలు పడ్డారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా జనం సంతోషంగా ఉన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి. జాతిపిత మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం ఆచరణలోకి వచ్చింది. పేదలకు కూడు, గూడు, సంక్షేమ పథకాలు అందజేయడంతో సంక్షేమ రాజ్యంగా పేరుగాంచింది. మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టడంతో ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది.

గ్రామంలో అభివృద్ధి పనులు ఇలా..

- గ్రామ పంచాయతీ ఆవిర్భావం నుంచి పంచాయతీ కార్యాలయం లేదు. అద్దె భవనాల్లో పాలన సాగేది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రూ. 42 లక్షలతో గ్రామ సచివాలయం నిర్మించారు.
- రైతు సంక్షేమం కోసం వ్యవసాయ గోడౌన్ ఏర్పాటు చేశారు. రైతులు తాము పండించిన ధాన్యంను తమ గ్రామంలోనే నిల్వ చేసుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది.
- ముస్లింలు, పేదలకు 659 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామంలో 95 శాతం మంది పేదలకు సొంతింటి కల నెరవేరింది.
- గడప గడపకు మన ప్రభుత్వం, ఉపాధి పథకం, నియోజక అభివృద్ధి నిధులు రూ.75 లక్షలతో వీధుల్లో సీసీ రోడ్లు నిర్మించారు.
- ఆంజనేయ స్వామి గుడి నుంచి పాతకోట వరకు రూ.8 లక్షలతో సిమెంట్ రోడ్డు వేశారు.
- కొత్త కాలనీలో రూ.4.50 లక్షలతో తాగునీటి కోసం కొత్త పైప్‌లైన్లు, విద్యుత్ సౌకర్యం కల్పించారు.
- చిన్న గుడిగా ఉన్న శ్రీ రామేశ్వర దేవాలయం రూ.40 లక్షలు కేటాయించడంతో జీర్ణోద్ధరణ గావించారు.
- మన బడి నాడు- నేడు కింద ప్రాథమికోన్నత పాఠశాల, ఉర్దూ ప్రాథమిక పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయి.
- రైతుల సంక్షేమం కోసం బోయలకుంట్ల నుంచి ఇసుకపల్లె వరకు రూ.24 లక్షలతో గ్రావెల్ రోడ్డు వేశారు.



గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం



జీర్ణోద్ధరణ చేపట్టడంతో నూతనంగా శ్రీరామేశ్వరస్వామి ఆలయం



రైతులకు అందుబాటులో గోదాము



వీధుల్లో సిమెంట్ రోడ్డు నిర్మించిన దృశ్యం

సంక్షేమాభివృద్ధితో లబ్ధి..

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ. 17.10 కోట్లు, పరోక్ష ప్రయోజనాలు ద్వారా రూ. 6.96 కోట్లు గ్రామస్తులకు లబ్ధి చేకూరింది.

- ఇళ్ల స్థలాలకు రూ. 3.54 కోట్లు, పక్కా గృహాలకు రూ. 1.36 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.
- 415 మందికి జగనన్న అమ్మఒడి కింద రూ. 1.94 కోట్లు. 170 మంది విద్యార్థులకు రూ.50.54 లక్షలు విడుదల చేసింది.
- 611 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 2.95 కోట్లు వారి ఖాతాల్లో జమ చేసింది.
- వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 345 మంది రైతులకు రూ.50.25 లక్షలు, వైఎస్సార్ పింఛన్ కానుక కింద509 మందికి రూ.4.79 కోట్లు అందజేసింది. – వైఎస్సార్ ఆసరా కింద 521 మందికి రూ.1.70 కోట్లు, చేయూత కింద 237 మందికి రూ.1.07 కోట్లు, ఆరోగ్యశ్రీ కింద 236 మందికి రూ.92.82 లక్షలు అందాయి.

సొంతింట్లో చేరాం



14 ఏళ్ల నుంచి మేం ఉమ్మడి కుటుంబంలో ఉన్నాం. ఇల్లు చిన్నగా ఉండటంతో ఇబ్బందిగా ఉండేది. సొంతంగా ఇలు కట్టుకోవాలన్న కోరిక ఎప్పటి నుంచో ఉండేది. అయినా ఆర్థిక పరిస్థితి లేక అలాగే ఉండిపోయాం. జగనన్న ప్రభుత్వం మాకు రూ.2 లక్షల విలువజేసే స్థలం ఉచితంగా ఇచ్చింది. అలాగే ఇళ్లు కట్టుకోవడానికి డబ్బులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇంటి నిర్మాణం పూర్తవడంతో గృహ ప్రవేశం పూర్తయ్యింది. సొంతింట్లో సంతోషంగా ఉన్నాం. ఈ ప్రభుత్వంలో మా కుటుంబానికి మొత్తం రూ.6 లక్షలు వచ్చాయి.

– సుప్రజ, గ్రామస్తురాలు

గ్రామాన్ని అభివృద్ధి చేశాం



జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేశాం. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్యాలయం లేక ఇబ్బందులు పడ్డాం. జగనన్న వచ్చిన తరువాత నిధులు విడదల అవడంతో కార్యాలయ భవనం నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చాం. గ్రామస్తుల ఇలవేల్పు అయిన రామేశ్వర స్వామి ఆలయాన్ని ప్రభుత్వ నిధులతో జీర్ణోద్ధరణ చేయించాం. ప్రతి వీధిలో సీసీ రోడ్డు వేయించాం. గ్రామస్తులకు మినరల్ వాటర్ సరఫరా చేస్తున్నాం. గ్రామానికే రూ.24 కోట్ల లబ్ధి చేకూరింది.

– జింకల నాగన్న, సర్పంచ్

ఓటరు నమోదుకు 16 వరకు దరఖాస్తుల స్వీకరణ

పాణ్యం : 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు కోసం ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఫణికుమార్ ఆదివారం తెలిపారు. బీఎల్ఓలు, ఆన్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో మాసశివరాత్రి సందర్భంగా చండీహోమం వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆర్జిత సేవల్లో భాగంగా చండీ హోమం పూజలను చేయించుకున్నారు. స్థానిక యాగశాలలో వేద పండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా హోమం చేపట్టారు. పూజల అనంతరం భక్తులకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.